తెడ్డెం-ఎడ్డెం
(తెలివైన కోడలు)

చేగొండి రామజోగయ్య

చెప్పుకొంటే సిగ్గుగాని, మా ఆవిడ కాంతం, ఆసాంతం, 'ఎడ్డెం అంటే తెడ్డెం' అనే రకం. పెళ్లయిన సుముహూర్తక్షణం నుంచి తను అంతే. తొలిరాత్రి పాలు తనే ముందు ఎంగిలి చేసి, నాకిచ్చి, తన ఆధిపత్యాన్ని నిరూపించుకొంది, నిర్ద్వంద్వంగా! క్షణం బిత్తరపోయిన నేను, తను మనోహరంగా నవ్వి బుగ్గ మీద చిటికె వేసేసరికి, చటుక్కున తేరుకొని నా పాలుపాలు గటగటా తాగేశాను. తిన్నగా ఉండకుండా, ఏదో పొగడాలనిపించి, "పూలజడ బాగుంది. కుడి పక్క పాపిడి తీయటం ఇంకా బాగుంది" అని వాగేను-

అంతే! వెంటనే, పూలజడ విప్పేసి, ఎడం పక్కకి పాపిడి తీసుకొని తల దువ్వుకొంది మళ్లీ, పందిరి మంచానికున్న అద్దంలో చూసుకొంటూ-

కొంచెం చిన్న బుచ్చుకొన్నాను గాని, విప్పేసిన పూలు పరుపు మీద చల్లి, పరువాలన్నీ అర్పించడానికి నాందిగా, మెత్తగా హత్తుకొని, కొత్త లోకానికి ఎత్తుకుపోయింది. పిచ్చిమాలోకంలో నోరెత్త లేకపోయేను-సంసారంలోని మధురిమలను గ్రోలసాగేను. అలా తన ఆభిజాత్యానికి తొలి రాత్రే హైబ్రీడ్ బీజాలు పడి, నా వ్యక్తిత్వానికి గట్టి బీగాలు పడ్డాయన్నమాట-గడుస్తున్న కాలం గాని, నా మంచితనం గాని తనలో ఏ మార్పూ తీసుకురాలేకపోయాయి నేనే, ఇది బాగుంది అది బాగుంటుందన్న, అభిప్రాయప్రకటనలు చేయటం అంత మేలు కాదని తెలుసుకొన్నాను. నెల తిరగ్గానే (ఛ, మీ ఊహ తప్పు-తను నెల తప్పలేదు) జీతం మొత్తం తీసేసుకొన్నా, సంసారం పొదుపుగా చేస్తూండటం గమనించి, నన్ను నేనే ఓదార్చుకొన్నాను. ఇంకో నెల తిరగ్గానే, ఓ రోజు నాకు జుట్టు దువ్వుతూ, ఉద్దేశ్యపూర్వకంగా మెత్తగా తాకుతూ, తాకిస్తూ, "ఈ అండీ, తెలుకొండీ అనటం చిరాగ్గా ఉంది-ప్రేమగా పేరుతో పిలుస్తా, ఏమంటావ్ ప్రకాశ్?'అనేసింది.

ఏమైనా అనటం శ్రేయస్కరం కాదు గాబట్టి, నోర్మూసుకొనే ఉన్నానని వేరే చెప్పాలా?

నా బట్టలు, బనీన్లు అండర్‌వేర్‌ల బ్రాండులతో తనే నిర్ణయిస్తున్నా, సెలెక్షన్ బాగానే ఉంటోందిగా, సైజులు సరిపోతున్నాయి కదా అని సర్దుకుపోతున్నాను-సర్దుకోకపోతే అన్నిటా ఉపవాసయోగం పడుతుందని అనుభవమైంది కదా!

ఇవన్నీ ఎలా ఉన్నా, ప్రతీ విషయంలోనూ, చిన్నా, పెద్దా అన్న భేదం లేకుండా "ఎడ్డెం అంటే తెడ్డెం" అనే ఏ కాస్త మినహాయింపులూ లేని కాంతం స్వభావం మాత్రం, నాకంతకంతకూ దుర్భరమైపోసాగింది-చాలా అసౌకర్యంగా కూడా-

ఉదాహరణకు, ఓసారి నోరు జారి "బెండకాయ పులుసు బాగుంటుందిస్మీ-ముదురువైనా సరే-" అన్నాను. అంతే, ఇంట్లో ఉన్న లేత బెండకాయలు, నవనవలాడుతున్నవాటిని, పనిమనిషికిచ్చేసి, దాన్నే అర్జంటుగా బజారు పంపి, దొండకాయలు తెప్పించి, పులుసు కాదు, వేపుడు చేసింది-ఏ మాట కా మాట చెప్పుకోవాలి, చాలా బాగా చేసింది-లొట్టలు వేసుకుంటూ తిన్నాను!

ఇంకోసారి, మంచి గుమ్మడికాయ, పల్లె నుంచి అమ్మ ప్రేమగా పంపించినదాన్ని చూసి, "దప్పళం చేస్తే బాగుంటుంది. మా అమ్మ బలేగా చేసేది"-అన్నా.

అక్కడే ఉన్న, ఇది విన్న పనిమనిషి, "గుమ్మడికాయ నేను పట్టుకుపోనా అమ్మగారూ?" అనేసింది పాత అనుభవాల దృష్ట్యా-

కాని కాంతం, "నీ పని చూస్కో"-అని కసిరింది. అత్తగారు పంపిందే ఐనా, అంత పెద్ద, మంచి గుమ్మడికాయను వదులుకోవడం ఇష్టం లేక-కాని మూడు రోజులు వరుసగా వులుసు పెట్టిందిపప్పుతో కలిపికొట్టటం నా పనైంది-అమ్మ పంపిన గుమ్మడి

కాయ పరాయి ఇంటికి పోలేదన్న సంతృప్తి నాకు మిగిలింది-దప్పళం ఎప్పుడైనా తినొచ్చు కదా-

ఇలా అన్ని విషయాల్లోనూ, కాంతం నిరంతరంగా కనపరిచే వ్యతిరేకధోరణికి ఎన్ని ఉదాహరణలైనా చెప్పుకోవచ్చు!

అయితే ఓ రోజు, టాయిలెట్టులో ఉన్నప్పుడు, నా బుర్రలో, బ్రహ్మాండమైన తరణోపాయం ట్యూబు లైటులా, కొంచెం ఆలస్యంగానైనా, దేదీప్యమానంగా వెలిగింది! కాంతం విపరీతధోరణిని అనుకూలంగా మార్చుకోగలిగే ఉపాయం, బ్రహ్మాస్త్రం తోచింది-

అప్పట్నుంచి, చాలా చాలా ముఖ్యమైన విషయాల్లో, నాకు కావల్సినదానికి వ్యతిరేకంగా మాట్లాడి గాని, ప్రతిపాదనలు చేసి గాని, సత్ఫలితాలు రాబట్టగలిగేవాణ్ని -అంటే మనమే ముందు "తెడ్డెం" అనేసి, "కాదు ఎడ్డెం" అనిపించుకోవడమన్న మాట నా బ్రహ్మాస్త్రం-అయితే ఇది చాలా అరుదుగా, ఉపయోగించవలసిన అస్త్రం-అన్న గ్రహింపూ తెలివితేటలూ, లేనివాణ్ని కాలేదు సుమా!

ఒక ఉదాహరణ చెప్పాలంటే, నా చిరకాలమిత్రుడు తన పెళ్లికి, కనీసం ఒక్కడివైనా తప్పనిసరిగా రావాలంటూ అభ్యర్థిస్తూ రాసిన ఉత్తరాన్ని, అన్ని నా ఉత్తరాల్లాగానే తనే ముందు చింపి, చదివి, నా చేతికిచ్చింది కాంతం 'ఏమంటా'వన్నట్లు కళ్లలోకి సూటిగా చూసింది-వెంటనే నేను, ఇది బ్రహ్మాస్త్రం ఉపయోగించాల్సిన సందర్భమని నిశ్చయించుకొన్నాను, నా మిత్రుడు ఎన్నోసార్లు ఎన్నో సందర్భాల్లో ఎంతో సహాయం చేసిన ఉదంతాలు ఆత్మీయంగా గుర్తుకు వచ్చి-

"కాంతం-ఈ పెళ్లికి నేను ససేమిరా వెళ్లను-ఓ సారి నన్ను అందరిలో 'ఆడంగోడు, భార్యావిధేయుడు' అన్నాడు-అంతే కాదు, పెళ్లి కానుక ఇవ్వాల్సివస్తుందని, మన పెళ్లికి రాకుండా ఎగ్గొట్టాడు అప్రాచ్యుడు"-అని అబద్ధాలు గడగడా చెప్పేను-

ఫలితం వేరే చెప్పాలా-భార్యాసమేతంగా మా వాడి పెళ్లికి వెళ్లి ఆనందించే భాగ్యం ప్రాప్తించింది. కూడా తను రావటమే గాక, కాంతం వధూవరులకు మంచి గిఫ్ట్ చదివించింది!

నిన్న మావయ్య బజారులో కనపడి-"అదేవిట్రా, మీ అమ్మను ఒంటరిగా ఊళ్లో ఉంచేస్తావూ? ఈ మధ్యన వొంట్లో కూడా బాగోట్లేదువంట కూడా సరిగా చేసుకోలేకపోతోంటే, మేమే ఏదో కూరా, నారా పంపించాల్సొస్తోంది. ఒక్కగానొక్క కొడుకువయ్యుండీ, నువ్వేం పట్టించుకోపోవటం ఏం బాగోలేదు"-అని దులిపేశాడు.

మనసు కలుక్కుమంది. చిన్నప్పుడే నాన్న పోతే, అమ్మ ఎంత కష్టపడి నన్ను పెంచిందో మరిచిపోలేను కదా!

ఇది మళ్లీ బ్రహ్మాస్త్రం ఉపయోగించాల్సిన అరుదైన సందర్భమని దృఢంగా నిశ్చయించుకొన్నా!

ఆ సాయంత్రమే, కాంతం పూలు గుచ్చుకొంటుండగా, పేపర్లో నా ముఖం దాచుకొని అన్నాను-"కాంతం-ఈ మధ్యన, మా అమ్మ అందరితోనూ, 'కొడుకూ, కోడల్ని వదిలిపెట్టి ఉండలేకపోతున్నాను. వాళ్ల దగ్గరికే వెళ్లిపోతాను. కోడలు ఇన్నేళ్ల తర్వాత నీళ్లోసుకొందంట కూడాను-నేను వెళ్లి సాయం చేస్తా'-అని తెగవాగుతోందట. ఆ చాదస్తపు ముసలిదాన్ని తీసుకొచ్చి మనింట్లో భరించటం నా తరం కాదు" అని.

'ఏమిటా పిచ్చివాగుడు, జన్మనిచ్చి పెంచిన తల్లిని పట్టుకొని? రేపే వెళ్లి తీసుకురా'-అని ఆజ్ఞాపిస్తుందని ఆశించాను-గతానుభవాల దృష్ట్యా-

కాంతం కాసేపు మాట్లాడలేదు-కొన్ని క్షణాలు నాకు దుర్భరంగా గడిచేక మెల్లగా అంది-"ఛ అదేమిటి-అత్తగారికి మనం గాక ఎవరున్నారు?"-కాసేపు ఆగింది.
ఆ మాటలకి నా చెవుల్లో అమృతం పోసినట్లైంది. "కాస్తైనా మాతృప్రేమ నీకు లేకపోయినా, అత్తగారంటే గౌరవం నాకైనా ఉండవద్దా?"-మళ్లీ అగింది.

కాంతం కాసేపు మాట్లాడలేదు-కొన్ని క్షణాలు నాకు దుర్భరంగా గడిచేక మెల్లగా అంది-"ఛ అదేమిటి-అత్తగారికి మనం గాక ఎవరున్నారు?"-కాసేపు ఆగింది.

ఆ మాటలకి నా చెవుల్లో అమృతం పోసినట్లైంది.

"కాస్తైనా మాతృప్రేమ నీకు లేకపోయినా, అత్తగారంటే గౌరవం నాకైనా ఉండవద్దా?"-మళ్లీ అగింది.

ఈ మాటలకి నా నోట్లో పంచదార పోసినట్లైంది-చెవులు రిక్కించి తదుపరి తేనె పలుకులకు నిరీక్షించాను-

ఈ సారి, సహజమైన దృఢస్వరంలో అంది-"రేపే వెళ్లి... ఊళ్లో ఇల్లు బేరం పెట్టు-వచ్చిన డబ్బు నా పేరు మీద బ్యాంకులో వేసి, ఆ వడ్డీ డబ్బులు వృద్ధాశ్రమంలో మీ అమ్మ సౌకర్యంగా ఉండేందుకు ఫీజు కడతాను-నెలకోసారన్నా మనం ఆవిణ్ని చూడ్డానికి వెళ్లి-పళ్లూ, వగైరా ఇవ్వొచ్చులే-సరేనా-అన్నట్టు ఆవిణ్ని డైరెక్ట్‌గా పల్లె నుండి వృద్ధాశ్రమానికే తీసుకెళ్లాలి సుమా! మా అమ్మ ఎల్లుండి మంచి రోజని ఇక్కడికొస్తోంది-నా పురుడు అయ్యేవరకు ఉంటుందిలే -ఊళ్లో ఇల్లు తింగరోడిలా, తక్కువ రేటుకిచ్చేయకు-ప్రకాశ్! ఎంత వస్తే అంత, మన పుట్టబోయే పిల్లాడి భవిష్యత్తు కోసమే కదా-" అనేసి బుగ్గ మీద చిటికేసి, ఇంకో మాట లేదన్నట్లుగా హాల్లోకి వెళ్లిపోయింది. 'తెలివైన కోడలు' సీరియల్ టీవీలో వచ్చే సమయం అయిపోయిందిగా మరి!



"డామిట్! కథ అడ్డం తిరిగింది!" అని గిరీశంలా వాపోవడం, ప్రయోగించిన "తెడ్డెం ఎడ్డెం" బ్రహ్మాస్త్రం వెనక్కొచ్చి నన్నే ముంచింది, అని అర్థం చేసుకోవటం నా వంతైంది-"తెడ్డెం ఎడ్డెం" ప్రయోగం ఫలించలేదని అర్థమైంది. ఇంకేం చేస్తాను??